సాక్షి
ఆదిలాబాద్

ఆదివారం । 28 । జూలై । 2024



పాఠశాలల్లో 'బోనాల' సందడి

జిల్లాలోని పలు పాఠశాలల్లో శనివారం బోనాల పండుగ నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 10లో▸

19 మంది జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ

కైలాస్‌నగర్: జిల్లాలో 19 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారి పని తీరుపై విచారించిన ఉన్నతాధికారులు 19 మందిని అర్హులుగా పేర్కొంటూ సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు. వారికి గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శి హోదా కల్పిస్తూ జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత ఉత్తర్వులు జారీ చేశారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

పలు చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

30న మౌన దీక్ష

ఆదిలాబాద్‌టౌన్: సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మౌన దీక్ష చేపడుతున్నట్లు ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శశికాంత్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న కార్యక్రమానికి పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ప్రొఫెసర్‌కోదండరాం, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, పూర్ణచందర్‌రావు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇందులో సంఘం బాధ్యులు దయాకర్‌రెడ్డి, జగన్మోహన్, గంగాధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఇంద్రవెల్లి: పరిశుభ్రత, ముందస్తు జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఏజెన్సీ అదనపు జిల్లా అధికారి కుడ్మెత మనోహర్ అన్నారు. మండలంలోని బొడ్డిగూడ గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆదివాసీ కళాబృందం ఆధ్వర్యంలో స్థానిక కొలాం గిరిజనులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇందులో కళాబృందం సభ్యులు సీతారాం, రమేశ్, లోకేశ్ తదితరులున్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

- ఎస్ఈ జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్‌టౌన్: వర్షాలు విస్తారంగా కురుస్తున్నప్పటికీ అంతరాయం లేకుండా వినియోగదారులకు విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ఆ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ తెలిపారు. శాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నందుకు సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారులు, ఉద్యోగులను అభినందించారని తెలిపారు. సమస్యలున్న ప్రాంతానికి సిబ్బంది తక్షణమే చేరుకొని పునరుద్ధరిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధి కారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. జూన్, జులై నెలల్లో 229 వంగిన విద్యుత్ స్తంభాలు, అలాగే 12 తుప్పు పట్టిన, 39 వదులుగా ఉన్న స్తంభాలను, 1850 మీటర్ల లైన్‌ను సరి చేశామని, 34 స్టెవైర్లు మార్చామని తెలిపారు. కొంత మంది రైతులు స్వచ్ఛందంగా వచ్చి విద్యుత్ శాఖకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రమాదభరితంగా ఉన్న వాటిని ముందస్తుగా గుర్తించి ఆస్తి,ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలుచేపడుతున్నామన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

కైలాస్‌నగర్: పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. స్థానిక కైలాస్‌నగర్‌లో శనివారం ఆయన పర్యటించారు. పలు వార్డుల్లో తిరుగుతూ రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.చెత్తను ఎక్కడిపడితే అక్కడ పడేయవద్దన్నారు. ఇంటివద్దకు వచ్చే మున్సిపల్ ట్రాక్టర్లు, ఆటోల్లోనే చెత్త వేయాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్నరోడ్లకు సైతం మరమ్మతులు చేయిస్తున్నామని, ఇప్పటికే పనులు ప్రారంభించినట్లుగా తెలిపారు.

క్రీడాభివృద్ధికి నిధులు శుభపరిణామం

ఆదిలాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడాభివృద్ధికి నిధుల కేటాయింపు శుభపరిమాణం అని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జాబాడే రాష్ట్రపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడారంగ చరిత్రలో సువర్ణ అధ్యాయానికి సీఎం రేవంత్‌రెడ్డి నాంది పలికారని, బడ్జెట్‌లో యువతకు బాసటగా నిలిచేందుకు రూ.325 కోట్లు కేటాయించారని తెలిపారు. నిధుల మంజూరుకు కృషిచేసిన రాష్ట్ర స్పోర్ట్స్ అడ్వైజర్ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, రాష్ట్ర ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కే. జగదీశ్వర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

ఎదులాపురం: ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా రొడ్డ శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సుజాత లాంగ్ లీవ్‌లో వెళ్లగా, ఆమె స్థానంలో శ్రీనివాస్‌ను నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.



బట్టిసావర్గాంలోని ఎల్ఐసీ ఏజెంట్స్ హౌసింగ్ కాలనీ వెంచర్

ఆపండి..!





- ఎల్ఐసీ ఏజెంట్స్ హౌసింగ్ కాలనీ ప్లాట్ల క్రయ, విక్రయాలపై నిషేధం
- రిజిస్ట్రేషన్ చేయరాదని కలెక్టర్ నుంచి ఉత్తర్వులు
- 72/3 సర్వేనంబర్ అసైన్డ్ భూమిలో అక్రమంగా వెలిసిన వెంచర్
- 'సాక్షి' కథనాల నేపథ్యంలో స్పందన

సాక్షి,ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బట్టి సావర్గాంలో ఉన్నటు వంటి ఎల్ఐసీ ఏజెంట్స్ హౌసింగ్ కాలనీ ప్లాట్ల క్రయ, విక్రయాలపై నిషేధ ముద్ర పడింది. ఆ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయరాదని కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు ఇచ్చారు. కొద్ది రోజుల క్రితమే ఇది వెలబడింది. అయితే ఆలస్యంగా వెలుగులోకి వస్తోంది. ఇప్పటికే ఇక్కడ రిజిస్ట్రేషన్లను నిలిపివేశారు. అసైన్డ్ భూమిలో అక్రమంగా వెలసిన ఈ వెంచర్‌లో క్రయ, విక్రయాలు జరుగుతున్నాయని, రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయని 'సాక్షి'లో జూన్ 15న 'అసైన్డ్.. హాంఫట్' శీర్షికన కథనం ప్రచురితం అయింది. ఆ తర్వాత ఈ ప్లాట్లకు సంబంధించి మున్సిపాలిటీలో అక్రమంగా ఎల్ఆర్ఎస్ చేస్తున్నారని జూన్ 16న 'లోగుట్టు.. చెరిపేస్తున్నారు' శీర్షికన మరో కథనం ప్రచురితం అయింది. వీటిపై స్పందించిన కలెక్టర్ చర్యలకు ఉపక్రమించారు.

అసైన్డ్ భూమి కైంకర్యం..

జిల్లా కేంద్రంలోని మావల మండలం బట్టిసావర్గాంలో నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం నిర్మిస్తున్నారు. దీని వెనకాలే ఉన్న 72/3 సర్వే నంబర్‌లో 10 ఎకరాల అసైన్డ్ భూమిని కొంత మంది కలిసి కైంకర్యం చేశారు. ఎల్ఐసీ ఏజెంట్స్ హౌసింగ్ కాలనీ పేరిట ఈ విస్తీర్ణంలో వెంచర్ రూపొందించారు. ఏళ్ల క్రితం నుంచే ఈ ప్రక్రియ చేపట్టినప్పటికీ కొద్ది కాలం నుంచి ప్లాట్లుగా చేయడం, గతంలోనే ఈ సొసైటీలోని కొంత మంది పేరిట రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ ప్లాట్లుగా మలిచిన తర్వాత వాటిలో రీసేల్ ప్రారంభించారు. సరైన లింక్ డాక్యుమెంట్లు లేకపోయినప్పటికీ రిజిస్ట్రేషన్ శాఖలో డబ్బులు ముట్టజెప్పి వ్యవహారం కానిచ్చారనే విమర్శలు వ్యక్తం అయ్యాయి. అప్పటి నుంచి ఈ భూమి వ్యవహారం వివాదాస్పదం అయింది. కాగా మున్సిపాలిటీలో ఈ ప్లాట్లకు సంబంధించి ఎల్ఆర్ఎస్ చేయడం కూడా విమర్శలపాలైంది. ఈ వ్యవహారాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీంతో ఈ ప్లాట్లకు సంబంధించి ఎల్ఆర్ఎస్ ప్రక్రియను గత నెలలోనే మున్సిపాలిటీలో నిలిపివేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారంలో అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఇక్కడ రిజిస్ట్రేషన్లు కూడా నిలిపివేయాలని స్వయంగా కలెక్టర్ ఆదేశించారు. దీంతో మళ్లీ ఈ ప్లాట్ల వ్యవహారం చర్చలోకి వచ్చింది.

వందకుపైగా ప్లాట్లు..

ఈ అసైన్డ్ భూమిని కైంకర్యం చేయడంలో ఎల్ఐసీ ఏజెంట్స్ హౌసింగ్ కాలనీ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన కొంత మంది రెవెన్యూ, మున్సిపాలిటీ, రిజిస్ట్రేషన్ శాఖల్లోని పలువురు అధికారులను డబ్బులిచ్చి మచ్చిక చేసుకుని వ్యవహారం సాగించారనే అపవాదు ఉంది. ఈ అసైన్డ్ భూమికి సంబంధించి గతంలో రెవెన్యూ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) వచ్చేలా చేయడంలో వారు సక్సెస్ అయ్యారు. ఆ తర్వాత దీనిపై విమర్శలు వ్యక్తం కావడంతో ఆ ఎన్వోసీని ప్రభుత్వం రద్దు చేసింది. అయితే రద్దయిన వ్యవహారాన్ని గుట్టుగా ఉంచారు. మొదట కొంత మంది పేరిటనే ఈ పదెకరాల విస్తీర్ణాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. ఆ తర్వాత ప్లాట్లుగా మలిచి అందులో ఎల్ఐసీ ఏజెంట్ల పేరిట కొన్నింటిని రిజిస్ట్రేషన్ చేసి మిగతా సింహ భాగం కొంత మంది పెద్దల చేతిలోనే ఉంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పలువురు ఏజెంట్లు ఈ ప్లాట్లను విక్రయించడంతో ఇటీవల రీసేల్ మొదలైంది. వీటికి సంబంధించే కొద్ది నెలలుగా సుమారు 50 వరకు రిజిస్ట్రేషన్లు అయినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా మున్సిపాలిటీలో వీటికి సంబంధించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ వెంచర్‌లో సుమారు 160 వరకు ప్లాట్లు ఉండగా లింక్ డాక్యుమెంట్ లేకుండా ఎల్ఆర్ఎస్ ఏ విధంగా చేస్తున్నారనే విమర్శలు మున్సిపాలిటీ అధికార యంత్రాంగంపై వ్యక్తం అయింది. దీంతో వారు ఎల్ఆర్ఎస్‌ను నిలిపివేశారు. తాజాగా రిజిస్ట్రేషన్లు కూడా నిలిచిపోయాయి. తద్వారా ఈ ప్లాట్ల క్రయ, విక్రయాలపై నిషేధ ముద్ర పడింది.

> ఎల్ఐసీ ఏజెంట్స్ హౌసింగ్ కాలనీ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన కొంత మంది మొదటి నుంచి దొడ్డిదారిని అవలంబించారు. 2009లో ఈ భూమిని అసైనీ మదాస్తు నర్సింలు నుంచి కొనుగోలు చేసినట్లు రెవెన్యూ రికార్డులో ఉంది. ఆ ప్లాట్లు చేసేందుకు సర్పంచ్ నీరటి గంగన్న అనుమతి ఇచ్చినట్లు
>
> **లేఅవుట్ రూపకల్పనలోనూ దొడ్డిదారే..**
>
> లేఅవుట్ కాపీలో స్పష్టంగా ఉంది. అయితే గంగన్న బట్టి సావర్గాం సర్పంచ్‌గా 2001 వరకు మాత్రమే ఉన్నారు. అలాంటప్పుడు 2009 తర్వాత ఆ ప్లాట్లు చేసుకునేందుకు ఆయన ఎలా అనుమతి ఇచ్చారనేది ప్రశ్నార్థకం. అయితే 2010లో ఆయన మృతి చెందారు. ఆ తర్వాత వీరు లేఅవుట్ కాపీని ఇలా చనిపోయిన సర్పంచ్ అనుమతి ఇచ్చినట్లు సృష్టించడం ద్వారా అక్రమాలకు పాల్పడ్డారు. ఇలా అసైన్డ్ భూమిని కొట్టేసేందుకు ముందు నుంచి ఎన్నో ఎత్తుగడలను అవలంబించారు.

> **రిజిస్ట్రేషన్ చేయరాదని ఆదేశాలు**
>
> బట్టిసావర్గాంలోని 72/3 సర్వే నంబర్ ఎల్ఐసీ ఏజెంట్స్ హౌసింగ్ కాలనీలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయరాదని కలెక్టర్ ఆదేశించారు. దీంతో వాటికి సంబంధించి రిజిస్ట్రేషన్లను నిలిపివేశాం.
>
> – విజయ్‌కాంత్, సబ్‌రిజిస్ట్రార్, ఆదిలాబాద్

వీడని ముసురు

- ఐదు రోజులుగా వాన
- చల్లబడిన వాతావరణం

జిల్లాలో సగటు వర్షపాతం వివరాలు.. (జూన్ 1 నుంచి జూలై 27 వరకు)

సాధారణం	476.1 మి.మీ
కురిసింది	576.1 మి.మీ
వ్యత్యాసం	21 శాతం అధికం
స్థితి	అధిక వర్షపాతం



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వాన

సాక్షి,ఆదిలాబాద్: ముసురువాన వీడటం లేదు. గత మంగళవారం నుంచి మొదలైన ఈ ముసురు కొనసాగుతోంది. చిటపట చినుకులు కురుస్తూనే ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం ఓ మోస్తరుగా నమోదైంది. జిల్లాలో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఈ వర్షాల కారణంగా మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది.

అధిక వర్షపాతం..

జూన్ 1 నుంచి వర్షాకాలం మొదలవుతుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో 18 మండలాలున్నాయి. ఇందులో ఆదిలాబాద్‌రూరల్, ఆదిలాబాద్ అర్బన్ మండలాల్లో అత్యధికంగా, మరో ఆరు మండలాల్లో అధికంగా, 10 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

నీటి మట్టానికి చేరువలో ప్రాజెక్టులు..

జిల్లాలోని సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టులు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉన్నాయి. మొత్తం 392 చెరువులు ఉండగా ఇందులో చాలా వరకు 75 శాతం వరకు నిండాయి. కుంటాల, పొచ్చెర, గాయత్రి, ఖండాల జలపాతాల వద్ద వరద ప్రవాహం పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి.

మండలాల వారీగా.. (జూన్ 1 నుంచి జూలై 27 వరకు నమోదైన వర్షపాతం వివరాలు)

మండలం	సాధారణం(మి.మీ.)	కురిసింది (మి.మీ.)	స్థితి
భీంపూర్	421.4	486.4	సాధారణం
జైనథ్	500.5	558.9	సాధారణం
బేల	476.4	583.3	అధికం
గాదిగూడ	476.7	508.7	సాధారణం
నార్నూర్	491.8	471.5	సాధారణం
ఇంద్రవెల్లి	532.1	673.2	అధికం
గుడిహత్నూర్	431.6	578.7	అధికం
ఆదిలాబాద్‌రూరల్	481.6	771.7	అత్యధికం
ఆదిలాబాద్‌అర్బన్	483.2	778.5	అత్యధికం
మావల	473.8	484.8	సాధారణం
తాంసి	450.5	602.2	అధికం
తలమడుగు	461.0	490.1	సాధారణం
బజార్‌హత్నూర్	480.4	596.1	అధికం
బోథ్	458.5	522.1	సాధారణం
నేరడిగొండ	467.5	441.6	సాధారణం
ఇచ్చోడ	461.8	550.0	సాధారణం
సిరికొండ	496.9	539.4	సాధారణం
ఉట్నూర్	523.9	731.8	అధికం

ఏఐటీయూసీ శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతులకు హాజరైన నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఏఐటీయూసీ శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో శనివారం ప్రారంభించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. తొలి రోజు మార్క్సిస్టు మూల సూత్రాలను ఎస్ మధుకర్ వివరించారు. ప్రపంచీకరణ, వాటి ఫలితాలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బీఎస్ఆర్ మోహన్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకళ, గంగయ్య, ఆశన్న, కేశవ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ టాక్..

'భట్టి' నోట.. ఆదిలాబాద్ మాట

- ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాం
- వాటన్నింటిని పూర్తి చేస్తాం
- ధరణి సమస్యల పరిష్కారానికి సబ్ కమిటీ
- ఐటీడీఏకు సబ్‌ప్లాన్ నిధులు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సాక్షి,ఆదిలాబాద్: 'ఆదిలాబాద్ జిల్లా వాసులందరికీ ఈ సభ ద్వారా సందేశం పంపుతున్నా.. మీకు కావాల్సిన అన్ని కార్యక్రమాలు చేపడతాం.. ఈ జిల్లాలో చిన్న చిన్న ప్రాజెక్టులు ఉన్నాయి.. కుప్టి, త్రివేణి సంగమం, పులిమడుగు వాగు, చిక్మాన్ ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాం.. వాటన్నింటిని పూర్తి చేస్తాం..' అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రసంగిస్తూ ఆదిలాబాద్ జిల్లాను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ జిల్లాలో ధరణి సమస్యలు చాలా ఎక్కువ ఉన్నాయని అన్నారు. వీటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం సబ్ కమిటీ వేసి ముందుకు వెళ్తుందన్నారు. ఐటీడీఏ ఒకప్పుడు అద్భుతంగా పని చేసిందన్నారు. ప్రస్తుతం నిర్వీర్యమైనటువంటి ఐటీడీఏ కోసం సబ్ ప్లాన్ నిధులు పరిపుష్టిగా పెట్టామని చెప్పారు. గిరిజన సోదరులు హమ్మయ్య కాంగ్రెస్ పార్టీ వచ్చింది.. మళ్లీ మాకు బతుకు వచ్చిందని ఆనందపడేలా చేస్తామని భట్టి వివరించారు.

విజ్ఞప్తులు పట్టించుకోలే.. నిధులివ్వలే

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలు, అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి, మంత్రులకు అందించిన విజ్ఞప్తులను పట్టించుకోలేదని, బడ్జెట్లో ఎలాంటి నిధులు కేటాయించలేదని స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. అసెంబ్లీలో శనివారం బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అస్పష్టంగా ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ఎంత మేరకు కేటాయింపులు చేస్తారనే విషయాన్ని స్పష్టంగా వెల్లడించలేదని విమర్శించారు. మరో వైపు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎలాంటి నిధులు కేటాయించలేదని తీర్మానం చేయడం సమంజసం కాదన్నారు. రుణమాఫీ విషయంలో అర్హుల గుర్తింపు ప్రక్రియకు సంబంధించి సరైన విధి విధానాలు ప్రకటించాలన్నారు.

టేకు.. నాటేదెలా?

- నాలుగేళ్లుగా నిలిచిపోయిన మొక్కల సరఫరా
- వన మహోత్సవంలోనూ కనిపించని వైనం
- డిమాండ్ ఉన్నా అందించని యంత్రాంగం
- ఆర్థిక ప్రయోజనాలకు దూరమైన అన్నదాత



గతంలో నర్సరీలో పెంచిన టేకు మొక్కలు

కైలాస్‌నగర్: అడవుల విస్తీర్ణం పెంచాలనే సదుద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టింది. ఏటా వర్షాకాలంలో పలు రకాల మొక్కలు నాటేలా చర్యలు చేపట్టింది. అలాగే అన్నదాతకు ఆర్థికంగా అదనపు ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతో లాభదాయకమైన టేకు మొక్కలు నాటే దిశగా ప్రోత్సహించింది. మొక్కలు ఉచితంగా అందించడంతో పాటు వాటిని చేల గట్లపై, బీడు భూముల్లో నాటించడం, సంరక్షణకు సైతం ఆర్థిక చేయూతనందించేది. అయితే నాలుగేళ్లుగా జిల్లాలో ఈ మొక్కల జాడ కానరావడం లేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన వనమహోత్సవంలోనూ ఈ మొక్కలు పూర్తిగా మాయమయ్యాయి. రైతుల నుంచి డిమాండ్ ఉన్నప్పటికీ యంత్రాంగం వాటిని అందించడం లేదనే విమర్శలున్నాయి.

నాలుగేళ్లుగా నిలిచిన సరఫరా..

హరితహారంలో భాగంగా గతంలో ఏటా వర్షాకాలంలో అంతటా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టేవారు. నీడనిచ్చే వేప, రావి, మర్రితో పాటు పూలు, పండ్ల మొక్కలను ప్రభుత్వం అందించేది. వీటితో పాటు రైతులు తమ పొలాల గట్లపైన నాటకునేందుకు వీలుగా టేకు మొక్కలనూ ఉచితంగా అందిచేది. అయితే నాలుగేళ్లుగా వీటి పంపిణీ నిలిపివేశారు. అలాగే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే నర్సరీల్లో ఈ మొక్కల పెంపకం చేపట్టడం లేదు.

అన్నదాతకు లబ్ధి ఇలా..

గతంలో చిన్న, సన్నకారు రైతులకు ఎకరాకు 150 చొప్పున టేకు మొక్కలు పంపిణీ చేశారు. నర్సరీల్లో పెంచిన మొక్కలను రైతుల డిమాండ్ మేరకు ప్రభుత్వం ఉచితంగా అందించేది. అలాగే వాటిని పొలం గట్లపైన, బీడు భూముల్లో నాటించేందు కోసం ఉపాధి కూలీలతో గుంతలు తీయించి మొక్కలు నాటించేవారు. వాటి సంరక్షణకు సైతం ఈజీఎస్ ద్వారా చేయూత అందించేది. ఒక్కో మొక్కకు నెలకు రూ.5 చొప్పున చెల్లించేది. రెండేళ్ల పాటు ఈ ఆర్థికసాయం కొనసాగేది. ఇలా అవి వృక్షాలుగా ఎదిగేందుకు అన్నదాతకు దోహదపడేది.

> **వచ్చే ఏడాది అందిస్తాం..**
>
> టేకు మొక్కలను డీఆర్డీఏ, అటవీశాఖ నర్సరీల్లో పెంచడం లేదు. అందుకనే వాటిని ఇవ్వలేకపోతున్నాం. రైతుల నుంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో టేకు మొక్కలను పెంచేందుకు అవసరమైన అనుమతి ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాశాం. అనుమతి లభిస్తే వచ్చే ఏడాది రైతులకు అందజేసేలా చర్యలు తీసుకుంటాం.
>
> – ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీఎఫ్‌వో

డిమాండ్ ఉన్నా అందించని వైనం

జిల్లాలో టేకు మొక్కలపై రైతుల్లో డిమాండ్ ఉన్నప్పటికీ యంత్రాంగం వాటిని అందించడం లేదనే విమర్శలున్నాయి. గత మూడు విడతల హరితహారంలోనూ అందించకపోగా తాజాగా ఈ ఏడాది అమలు చేస్తున్న వనమహోత్సవంలోనూ టేకు మొక్కలు ఇవ్వడం లేదు. దీనిపై ఆసక్తి గల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగానే మొక్కలను ఉచితంగా అందించాలని కోరుతున్నారు. ఈ విషయమై డీఆర్డీవో సాయన్నను పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

రిజర్వేషన్లు పెంచాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్





మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: బీసీల రిజర్వేషన్ పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సమగ్ర కుల గణన సాధన యాత్రలో భాగంగా శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్ఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీలను మోసం చేయడానికి యత్నిస్తే ఊరుకోమన్నారు. 136 కులాలున్న బీసీల సంఖ్య తెల్చకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కుల గణన చేపట్టి బీసీల లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటయోధులకు ఆదిలాబాద్ జిల్లా నిలయమని ఇక్కడి నుంచే సామాజి క న్యాయం కోసం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. అంతకు ముందు బీసీలకు జరుగుతున్న అన్యాయలపై బీసీ సంఘాల నాయకులు మాట్లాడారు. ఇందులో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీనివాస్, మంచికట్ల ఆశమ్మ, నర్సాగౌడ్, అజయ్, గణేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్టుకు శనివారం 5,806 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో, ప్రాజెక్ట్‌ అధికారులు ఒక గేటు ఎత్తి 7,120 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 700 (7.603 టీఎంసీ) అడుగులు కాగా ప్రస్తుతం 694 (6.136టీఎంసీ) అడుగులు ఉంది.

బాసరలో ఏపీ అడిషనల్‌ డీజీ పూజలు



మీనాను ఆశీర్వదిస్తున్న అర్చకులు

బాసర: నిర్మల్‌ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని ఏపీ అడిషనల్‌ డీజీ ఆర్కే మీనా శనివారం దర్శించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన ఆయన రాష్ట్ర విభజనతో ఏపీ కేడర్‌కు కేటాయించారు. శనివారం ఆలయానికి వచ్చిన మీనాకు అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్‌ మీనా కుటుంబ సభ్యుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి హారతి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. మీనా వెంట నిర్మల్‌ ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్‌, బాసర ఎస్సై గణేశ్‌ తదితరులు ఉన్నారు.

'సకురా సైన్స్‌'కు ఎంపిక పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిర్మల్‌ రూరల్‌: జపాన్‌లో నవంబర్‌ 10నుంచి 16వరకు నిర్వహించనున్న సకురా సైన్స్‌ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం జిల్లా కేంద్రంలోని అర్బన్‌ కేజీబీవీలో విద్యార్థులకు స్క్రీనింగ్‌ పరీక్ష నిర్వహించారు. అర్హత కలిగిన 22మంది జిల్లాలోని కేజీబీవీ, మోడల్‌ స్కూల్‌, రెసిడెన్షియల్‌ పాఠశాలల్లో ఇంటర్‌ ఫస్టియర్‌ చదువుతున్న, 10వ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో జిల్లా కేంద్రంలోని టీఎస్‌ఆర్‌జేసీ విద్యార్థిని జీ తనుశ్రీ ప్రతిభ చాటి ఎంపికైనట్లు డీఈవో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 33 మంది విద్యార్థులను ఎంపిక చేసి, రాష్ట్రస్థాయిలో స్క్రీనింగ్‌ టెస్ట్‌ నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురిని నవంబర్‌లో ప్రభుత్వం జపాన్‌కు పంపించనుందని పేర్కొన్నారు. జిల్లా సైన్స్‌ అధికారి వినోద్‌కుమార్‌, అబ్జర్వర్‌ విజయ్‌కుమార్‌, నారాయణవర్మ, మనోహర్‌రెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

విషాహారం తిని పెంపుడు జంతువులు మృతి

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఉడుత పోషక్కకు చెందిన పెంపుడు జంతువులు విష ఆహారం తిని మృతి చెందాయి. ఎస్సై రాములు తెలిపిన కథనం ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన బండం సురేందర్‌రెడ్డి పోషక్కపై గల కక్షతో ఆమె నివాసం సమీపంలో విషం కలిపిన బియ్యం వేశాడు. బియ్యాన్ని తిన్న ఒక గొర్రె, 5 కోడిపిల్లలు, కుక్క అక్కడికక్కడే మృతి చెందాయి.

వాగు దాటితేనే వైద్యం



వాగు దాటి గోపాల్‌పూర్‌ గ్రామానికి వెళ్తున్న వైద్యాధికారులు



అడవిలో కాలినడకన జెండాగూడకు వెళ్తున్న వైద్య సిబ్బంది



తిప్ప వాగు దాటుతున్న వైద్య సిబ్బంది

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అనేక గ్రామాలకు వెళ్లే మార్గాల్లో వాగులు ఉండడంతో రాకపోకలు సాగించే వారు ప్రమాదకరంగా వాగులు దాటుతున్నారు. ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించగా వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది వాగులు దాటారు. కొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన వెళ్లి వైద్య సేవలు అందించారు. ఇంద్రవెల్లి మండలం పిట్టబొంగరం పీహెచ్‌సీ పరిధి హీరాపూర్‌ గ్రామపంచాయతీలోని గోపాల్‌పూర్‌ గ్రామానికి వైద్యులు ప్రతాప్‌నాయక్‌, పూజిత, సిబ్బంది శనివారం వాగులు, వంకలు దాటి ఐదు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్యసేవలు అందించారు. ఇచ్చోడ మండలం నర్సాపూర్‌ పీహెచ్‌సీ సిబ్బంది అడవిబాటలో కాలినడకన నాలుగు కిలోమీటర్లు వెళ్లి వైద్య సేవలు అందించారు. జెండాగూడ, ధర్మాజీపేట్‌, కొలంగూడ, బుర్సిగుట్ట గ్రామాలకు హెల్త్‌అసిస్టెంట్‌ రాథోడ్‌ కృష్ణ, ఏఎన్‌ఎం రేణుక, ఆశ కార్యకర్త సరోజలు నడుచుకుంటూ వెళ్లి వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌రూరల్‌ మండలంలోని తిప్ప, అద్దగుట్ట, అసోదా బొప్పపూర్‌ మారుమూల గిరిజన గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో వాగులు పొంగుతుండడంతో వైద్య సిబ్బంది వాటిని దాటుతూ వెళ్లి శిబిరాలు నిర్వహించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాల్లో రోడ్డు సౌకర్యంతో పాటు వాగులపై వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- ఇంద్రవెల్లి/ఇచ్చోడ/ఆదిలాబాద్‌రూరల్‌

గడ్డి మందుకు అడ్డేది?

- గ్లైసిల్‌ విత్తనం మాదిరే.. గ్లైఫోసెట్‌ సరఫరా
- దెబ్బతింటున్న భూసారం
- ప్రభుత్వ నిషేధం ఉన్నా పట్టింపేది?

మంచిర్యాలఅగ్రికల్చర్‌: ఈ ఖరీఫ్‌ సీజన్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధిత, గుర్తింపు లేని విత్తనాలను అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. నిషేధిత విత్తన సరఫరాని పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోయారు. ఇప్పుడు కలుపుమందు సరఫరా నియంత్రించకపోవడంతో జిల్లాలో అక్రమవ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా ఉంది. విత్తనాలు, కలుపు నివారణ గడ్డి మందు దందా యథేచ్ఛగా సాగుతోంది. ఓ వైపు వర్షాలు కురుస్తుండడం, మరో వైపు చేలలో కలుపు మొక్కలు పెరిగిపోతున్నాయి. దీని నివారణకు రైతులు నిషేధిత గ్లైఫోసెట్‌ను వాడుతున్నారు. వ్యాపారులు గుర్తింపు లేని పత్తి విత్తనాలు చేరవేసిన మాదిరిగా గ్లైఫోసెట్‌ను అందజేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి జిల్లాకు చేరవేస్తున్నారు. అటవీప్రాంతం, చేల వద్ద భూమిలో పాతి పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. కొందరు వ్యాపారులు మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌, తాండూర్‌, భీమిని, మహారాష్ట్ర సిరొంచ మీదుగా అర్జునగుట్ట, కోటపల్లి, చెన్నూర్‌ సరిహద్దు నుంచి వేలాది లీటర్లు తరలిస్తున్నారు. చోటమోట నాయకుల హస్తంతోనే పెద్ద మొత్తంలో సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాత్రికి రాత్రే ప్రైవేటు వాహనాల ద్వారా జిల్లాకు చేరుకుంటున్నాయి. గ్లైఫోసేట్‌తో భూసారం కోల్పోవడం, పర్యావరణానికి ముప్పు ఉంది. రైతులు క్యాన్సర్‌, తదితర ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.



స్వాధీనం చేసుకున్న గ్లైఫోసెట్‌ గడ్డిమందు (ఫైల్‌)

గుట్టుచప్పుడు కాకుండా..

ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం 1.60 లక్షల ఎకరాల్లో ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 1.48 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఇందులో 30 శాతం వరకు నిషేధిత గ్లైసిల్‌ విత్తనాలే ఉన్నట్లు తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత గ్లైఫోసెట్‌ మందును రైతులకు అందిస్తున్నారు. లీటర్‌కు రూ.700 నుంచి 900 చొప్పున, 5 లీటర్లు, 10 లీటర్లు, 20 లీటర్ల క్యాన్లు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. లిక్విడ్‌ కాకుండా పౌడర్‌ రూపంగా తీసుకువస్తున్నారు.

దెబ్బతింటున్న భూసారం

పత్తి చేనులో కలుపు తీతకు రైతులు గ్లైఫోసెట్‌ను వాడుతున్నారు. దీంతో పర్యావరణానికి హానితోపాటు భూసారం దెబ్బతింటుంది. జిల్లాలో సాగయ్యే పత్తి పంట కలుపు నివారణ, కూలీల కొరతను అధిగమించడానికి గ్లైఫోసెట్‌ మందును పిచికారికి ఆసక్తి కనబరుస్తున్నారు. నిషేధిత గ్లైఫోసెట్‌ కొనుగోలుకు వేలకు వేలు ఖర్చుచేస్తున్నారు. అధికారులు దాడులు చేసి వందల క్వింటాళ్ల గ్లైసిల్‌ లూజు క్వింటాళ్ల కొద్దీ విత్తనాలు, ప్యాకెట్లను పట్టుకున్నారు. అప్పటికే చాలామటుకు విత్తనాలు రైతులకు చెంతకు చేరాయి.

ప్రాణానికి ముప్పు

నాలుగైదు ఏళ్ల నుంచి ఉమ్మడి జిల్లాలో రైతులు నిషేధిత (బీజీ–3) పత్తి విత్తనాలు సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలు అమెరికాకు మోన్‌శాంటో అనే కంపెనీ విడుదల చేసింది. విత్తనంతోపాటు అదే కంపెనీ గ్లైఫోసెట్‌ పేరుతో గడ్డి మందును తయారు చేసింది. బీజీ–3 పత్తి విత్తనం సాగు చేసిన పంటలో ఈ మందు పిచికారి చేస్తే గడ్డి మాత్రమే చనిపోతుంది తప్పా పత్తి మొక్కలకు ఏమి కాదు. కాని ఈ గ్లైఫోసెట్‌ వినియోగించడం వల్ల భూసారం కోల్పోవడం, పర్యావరణానికి హాని, రైతులకు ప్రాణానికి ముప్పు కలుగుతుంది. ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి పెద్దమొత్తంలో వీటి అమ్మకాలు నిషేధించింది.

'గాయత్రి' పరవళ్లు



ఇచ్చోడ మండలం గుండివాగు అటవీ ప్రాంతంలో సహజసిద్ధంగా ఏర్పడ్డ గాయత్రి జలపాతం నీటితో పరవళ్లు తొక్కుతోంది. 350 అడుగుల ఎత్తులోని రెండు భారీ కొండల మధ్య నుంచి పారుతున్న జలపాతం చూపరులకు కనులవిందు చేస్తోంది. ఇచ్చోడ నుంచి 13 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. - ఇచ్చోడ

వరకట్న వేధింపులకు వివాహిత ఆత్మహత్య



అనసూయ (ఫైల్‌)

ఇంద్రవెల్లి: వరకట్న వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలోని బజార్‌గల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై సునీల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దనోర.బి గ్రామానికి చెందిన అనసూయ(24)కు ఆరేళ్ల క్రితం ఇంద్రవెల్లికి చెందిన జతురే శివాజీతో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో ఐదు తులాల బంగారంతో పాటు ఇంటి సామగ్రి కట్నంగా ఇచ్చారు. కాగా అదనపు కట్నం రూ. 20వేలు కావాలని కొంతకాలంగా భర్తతో పాటు అత్త, మామలు మానసికంగా ఆమెను వేధిస్తున్నారు. వారి వేధింపులు తాళలేక ఈ నెల 23న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అనసూయ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రిని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్‌కు తరలించారు. అనసూయ తండ్రి సంపతే గోపినాథ్‌ ఫిర్యాదు మేరకు భర్త జతురే శివాజీతో పాటు అత్తమామలు జతురే అంగద్‌, దైవబాయిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బాలుడు మృతి



గణేశ్‌ (ఫైల్‌)

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన వేల్పుల గణేశ్‌ (13) అనే బాలుడు పచ్చకామెర్ల వ్యాధితో శనివారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కప్పర్ల జిల్లా పరిషత్‌ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గణేశ్‌ గత 15 రోజుల నుంచి పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ ఆస్పత్రిలో వారం రోజుల పాటు చికిత్స తీసుకున్నాడు. వ్యాధి తీవ్రత పెరగడంతో వైద్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆస్పత్రికి రెఫర్‌ చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం పరిస్థితి విషమించి బాలుడు మృతి చెందాడు.

గుండెపోటుతో రిటైర్డ్‌ డిప్యూటీ కమిషనర్‌ మృతి

కుభీర్‌: మండల కేంద్రానికి చెందిన సిరిముల సాంబన్న హైదరాబాద్‌లో శనివారం ఉదయం గుండెపోటుతో చనిపోయారు. ఆయన మొదట నవోదయ పాఠశాలలో లెక్చరర్‌గా, ఆ తర్వాత ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అనంతరం బెంగళూర్‌లో కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్‌గా పని చేసి 2022 ఆగస్టులో రిటైర్డయ్యారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆయన వచ్చే నెల 18న కూతురు పెండ్లి నిశ్చయం చేసుకున్నారు. ఇంతలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుభీర్‌లోని చిన్ననాటి స్నేహితులు, బంధువులు ఆయన మృతిపై సంతాపం తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో శనివారం గేదె మృతి చెందింది. గ్రామంలోని పెద్దమ్మ టెంపుల్‌ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఎర్త్‌వైర్‌ తగిలి గేదె మృతి చెందినట్లు రైతు కొత్త నర్సయ్య వాపోయారు. విద్యుత్‌ శాఖ సిబ్బంది మృతి చెందిన గేదెను పరిశీలించి వివరాలు సేకరించారు. రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వాగులపై ప్రజలకు అవగాహన



వాగు వద్ద అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఉట్నూర్‌రూరల్‌: వాగులో గల్లంతై పలువురు మృతి చెందుతుండడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉట్నూర్‌ ఎస్సై మనోహర్‌ ఆధ్వర్యంలో పోలీసు బృందంతో కలిసి భీముగూడ, అడగూడ, నర్సాపూర్‌ –జే గ్రామాలను సందర్శించారు. వర్షం కురిసే సమయంలో కల్వర్టులు, వాగులు, వంతెనలు దాటవద్దని, విద్యుత్‌ స్తంభాల నుంచి దూరంగా ఉండాలన్నారు. వర్షం పడుతున్నప్పుడు సెల్‌ఫోన్‌లు ఉపయోగించడం ప్రమాదకరమని, దెబ్బతిన్న ఇళ్లలో ఉండకూడదన్నారు. వాగు దాటే సమయంలో తాడును ఉపయోగించాలని సూచించారు.

'అవ్వతాతలకు ఉత్తరం' పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జైనథ్‌: మండలంలోని లక్ష్మీపూర్‌ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 7న పత్తిపాత ఫౌండేషన్‌, గరిపల్లి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో 'అవ్వతాతలకు ఉత్తరం, కథా రచన' పోటీలకు సంబంధించిన పోస్టర్‌ ఆవిష్కరించారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి అశోక్‌ ఇతరులతో కలిసి పోస్టర్‌ ఆవిష్కరించారు. కాగా ఆగస్టు 7న పాఠశాలలో లక్ష్మీపూర్‌కు చెందిన 40 మంది విద్యార్థులు, జెడ్పీఎస్‌ఎస్‌ కూరకు చెందిన మరో 10 మంది విద్యార్థులు కథా రచన, ఉత్తరాలు రాసే పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు.

పశువులు తరలిస్తున్న కంటైనర్‌ పట్టివేత



కంటైనర్‌లోని పశువులు

నేరడిగొండ: పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ లారీని పట్టుకున్నట్లు ఏఎస్సై రాథోడ్‌ మారుతి తెలిపారు. మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద శనివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా 54 పశువులను యూపీ నుంచి కేరళకు కంటైనర్‌లో తరలిస్తుండగా పట్టుకొని కంటైనర్‌ సీజ్‌ చేయడంతో పాటు పశువులను ఇచ్చోడలోని గోశాలకు తరలించారు. కాగా అక్రమంగా పశువులను తరలిస్తున్న దానిష్‌, అజీమ్‌, షాహిద్‌, ఆసీఫ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. తనిఖీల్లో హెడ్‌ కానిస్టేబుల్‌ నాందేవ్‌, కానిస్టేబుళ్లు శంకర్‌, కైలాస్‌, దినేష్‌లు పాల్గొన్నారు.

గోవులు తరలిస్తున్న వాహనం పట్టివేత

నిర్మల్‌టౌన్‌: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని జిల్లా కేంద్రంలో పలువురు యువకులు పట్టుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కెరమెరి నుంచి భైంసా వైపు గోవులను తరలిస్తున్నట్లు స్థానిక యువకులకు సమాచారం అందింది. వెంటనే గోవులు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని పోలీసులకు విషయం తెలియజేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గోవులను పట్టణంలోని బంగల్‌పేట్‌ గోశాలకు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీడీఏ పీవోకు అధికారాలు కొనసాగించాలి



మాట్లాడుతున్న పుర్క బాపురావు

ఉట్నూర్‌రూరల్‌: ఉమ్మడిజిల్లా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంతో పాటు భూ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వాలు కల్పించిన సింగిల్‌లైన్‌ అడ్మినిస్ట్రేషన్‌ హక్కులను ఐటీడీఏ పీవోకు కొనసాగించాలని ఆదివాసీ హక్కుల పోరాటసమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు డిమాండ్‌ చేశారు. శనివారం ఉట్నూర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఉమ్మడి జిల్లా తుడుందెబ్బ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ఐటీడీఏ ఏజెన్సీల్లోని సివిల్‌ కేసులను ప్రాజెక్టు అధికారి వద్ద దావాలు ఫైల్‌ చేయడానికి అనుమతి కల్పించి, కేసుల పరిష్కారానికి పీవోకు శాశ్వత అధి కారాలు కల్పించేలా ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీల భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతినిధిగా ఐటీడీఏ పీవోను నియమించి ఏజెన్సీ ప్రాంత భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు తిరుపతి, సీతారాం, హన్మంతరావు, పెందూర్‌ ధర్ము, అచ్యుతరావు, బాలేరావు, మనోజ్‌ తదితరులు ఉన్నారు.

నాడు వెలవెల.. నేడు జలకళ





బోథ్‌ మండలంలోని పొచ్చెర జలపాతం ప్రస్తుతం నీటితో కళకళలాడుతోంది. గత వేసవిలో నీరు లేక జలపాతం వెలవెలబోయి కళాహీనంగా మారింది. కాగా ప్రస్తుతం గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో భారీగా నీరు ప్రవహిస్తోంది. దీంతో పొచ్చెర జలపాతం చూపరులను ఆకట్టుకుంటోంది. - బోథ్‌